

నేటి నుంచి ప్రజ్ఞా వికాసం పరీక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 1, 2, 3 తేదీలలో జిల్లావ్యాప్తంగా 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ప్రజ్ఞా వికాసం పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు యుటిఎఫ్ మండల అధ్యక్షులు బేబీరాణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక సాగర్ మున్సిపల్ పాఠశాలలో వారు మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఈ పరీక్షలో అన్ని సబ్జెక్టులకూ కలిపి 100 మార్కులు ఉంటాయన్నారు. తెలుగు 10, ఇంగ్లీష్ 20, హిందీ 10, సోషల్ 20, పిఎస్ 10, ఎన్ఎస్ 10, మ్యాథ్స్ 20 మార్కులు ఉంటాయన్నారు. విద్యార్థులందరూ ఈ పరీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర బడ్జెట్‌పైనే ఆశలు

- రైలుకూత కోసం కోనసీమ వాసుల ఎదురుచూపులు
- కాకినాడ సెజ్‌లో కానరాని పరిశ్రమలు
- పెట్రో కెమికల్ కాంప్లెక్ నిర్మాణంతో ఉపాధి
- పిఠాపురం-కాకినాడ మెయిన్ లైన్ హామీ అమలయ్యేనా.!

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి పదేళ్ల దాటినప్పటికీ బడ్జెట్‌లో జిల్లాకు ఒరిగిందేమీ కనిపించడం లేదు. గత బడ్జెట్లలో కేటాయింపులు చూస్తే ఈ విషయం ఇట్టే అర్థమవుతుంది. ప్రతిసారీ గంపెడు ఆశలు పెట్టుకోవడం, బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత నిరాశకు గురవడం షరా మామూలుగానే జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎపికి ఇప్పుడైనా న్యాయం జరుగుతుందని, భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలుకు నిధులు కేటాయిస్తారని ఇక్కడి ప్రజలకు ఆశిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సారథ్యంలో భారీగా నిధులు కేటాయిస్తారని ఎన్నికలకు ముందు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కూడా బిజెపిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నేరుగా ప్రధాన మంత్రి మోడీతో సత్సంబంధాలు కలిగిన పవన్ ఈసారి ఏపీకి ఏ విధమైన నిధులను తీసుకొచ్చేందుకు కృషి చేశారనేది చర్చనీయాంశంగా మారింది. పిఠాపురం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన జిల్లాలో సుదీర్ఘ సమస్యల పరిష్కారానికి ఎలాంటి నిధులను రప్పించనున్నారో నేటి బడ్జెట్లోతో తెలిసిపోనుంది.


1999లో యువి.కృష్ణంరాజు కాకినాడ ఎంపిగా ఉన్న సమయంలో కాకినాడ- పిఠాపురం రైల్వే మెయిన్ లైన్‌కు అప్పటి ఎన్‌డిఎ ప్రభుత్వ బడ్జెట్‌లో స్థానం ఇచ్చింది. అదే రీతిగా ఇప్పుడు కూటమిలో భాగస్వామిగా వున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రైల్వే మెయిన్ లైన్‌కు కృషి చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

కాకినాడ నగరాన్ని విశాఖ-విజయవాడ మెయిన్ రైల్వేలైన్లోకి తీసుకువచ్చేందుకుగాను పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపం నుంచి ప్రత్యేకంగా రైలుమార్గాన్ని నిర్మించి కాకినాడను కలుపుకొంటూ సామర్లకోట రైల్వేలైను మార్గంలో కలపాల్సి ఉంది. 21.5 కిలోమీటర్లు ఉండే ఈ లైనుకు 2017-18లో రూ.400కోట్ల అంచనాకు చేరుకుంది. ప్రస్తుతం పెరిగిన భూసేకరణ వ్యయంతో ఇతర రేట్లను పరిగణనలోకి తీసుకుంటే ఇది రూ.1200-1500కోట్లకు చేరుకుంటుందని అంచనా. అలాగే డాక్టర్ బీఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లాలో అంతర్వేది వద్ద డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు అంశం ఈ బడ్జెట్ లో ప్రస్తావనకు వస్తుందని ఇక్కడి ప్రజలు ఆశిస్తున్నారు. కాకినాడ-కోటిపల్లి రైల్వే లైను పునరుద్ధరించాలని కోరుతున్నారు. రాష్ట్ర వాటా పేరుతో కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంతో కోటిపల్లి - నర్సాపురంరైలు కూడా నిలిచిపోయింది. దీంతో కోనసీమ ప్రాంతానికి రైలు కూత నేటికీ వినిఎపడలేదు.

కాకినాడ జిల్లా కేంద్రం అభివద్ధికి స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ మరో రెండేళ్ల గడువు పొడిగించే ప్రక్రియకు శ్రీకారం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కీలకమైన పెట్రో కారిడార్, భారతమాల ప్రాజెక్టులో భాగంగా ఆరు లైన్ల రోడ్లు, రిఫైనరీ, కేప్టివ్ పోర్టు, టెర్మినల్స్ ఇలా ఎన్నో ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం ముందు ఉన్నాయి. వాటిపై ఈ సారి ఎటువంటి ప్రకటన వస్తుందో చూడాలి.

పోలవరాన్ని పట్టించుకుంటారా..?

భారీ ప్రాజెక్టు పోలవరాన్ని ఈసారి బడ్జెట్లో కేంద్రం ఏ విధంగా పట్టించుకుంటుందనేది కీలకంగా మారింది. గత బడ్జెట్లో నిధుల కేటాయింపుపై నిర్దిష్టమైన హామీ ఇవ్వలేదు. నిర్వాసితుల సమస్యలు గిరిజనుల పునరావసం వంటి అంశాలపై ఈసారైనా స్పష్టమైన హామీ తోపాటుగా పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలో తాగునీరు, సాగునీరు, పరిశ్రమలకు అవసరమైన ఏడమ కాలువ పనులు ఏళ్లగా ముందుకు సాగడం లేదు. నిధుల కొరతతో అనేక అడ్డంకులు ఏర్పడ్డాయి. మరోవైపు నిర్వాసితులకు పరిహారం అందించడానికి ఇప్పటికైనా నిధులు కేటాయిస్తారా అనేది చూడాలి.



పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేనా.?

రూ.32 కోట్ల నిధులతో కాకినాడ పెట్రో కారిడార్ పేరుతో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తామని ఎన్నో ఏళ్లగా కేంద్ర ప్రభుత్వం హామీ ఇస్తున్నా ఎప్పుడూ రిక్తహస్తమే చూపుతున్నారు. కాకినాడ, తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లో సుమారు 14 వేల ఎకరాలను పరిశ్రమల కోసం కేటాయించారు. కాని ఎలాంటి పరిశ్రమలూ రాలేదు. తాజాగా ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో నైనా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన నిర్ణయం ప్రకటిస్తారని జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇక్కడ పెట్రో కారిడార్ కనుక ఏర్పాటు అయితే వేల మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను ఉపాధి లభించే అవకాశం ఉంది.

గోదావరి పుష్కరాలకు నిధుల కేటాయించేనా?

2027లో గోదావరికి పుష్కరాలు రానున్నాయి. ఈ నేపథ్యంలో పర్యాటకులకు సరైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రోడ్లు, ఘాట్‌ల ఆధునీకీకరణ, రోడ్ల విస్తరణ, విశ్రాంతి భవనాల ఏర్పాటు, ఇతర ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. దాదాపు రెండు కోట్ల మంది సందర్శకులు పుష్కరాలకు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తుంది. వారికి మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు తప్పని సరి. ఇప్పటి నుంచి పనులు మొదలు పెడితేనే అప్పటికి పూర్తవుతాయి. కేంద్రం ఈ బడ్జెట్‌లో పుష్కరాలకు ఎలాంటి నిధులు కేటాయిస్తుందో అందరూ ఎదురు చూస్తున్నారు.

హాకీ టోర్నమెంట్ నిర్వహణకు కమిటీలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈ నెల 15 నుంచి 28వ తేదీ వరకూ ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తూ కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లపై ఆయన అధికారులతో మాట్లాడారు. ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయా అంశాల వారీగా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసామన్నారు.కలెక్టర్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, సిపిఓ, డిఎస్డిఓలు సభ్యులుగా ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీ, వివిధ ఉప కమిటీల సహకారంతో టోర్నమెంట్ నిర్వహణను పర్యవేక్షిస్తుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఆర్‌డిఓ, ఎడిసి-కెఎంసి, జిల్లా ఉపాధి అధికారి, డిటిసి సభ్యులుగా లాజిస్టిక్ కమిటీ పని చేస్తుందన్నారు. డిటిసి నేతృత్వంలో ట్రాన్స్‌పోర్ట్, రిసెప్షన్ కమిటీ క్రీడాకారులకు స్వాగతం, రవాణా, బస సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. డిడి-గ్రౌండ్ వాటర్ నేతృత్వంలో రిజిస్ట్రేషన్ కమిటీ పాల్గొనేందుకు వచ్చిన టీముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించి వారికి అవసరమైన ఏర్పాట్ల కోసం మిగిలిన సబ్ కమిటీలకు సూచించాలన్నారు. సివిల్ సప్లయీస్ కార్పొరేషన్-డిఎం నేతృత్వంలో ఫుడ్ కమిటీ క్రీడాకారులకు ఆహార ఏర్పాట్లను, కాకినాడ ఆర్‌డిఓ నేతృత్వంలోని అకామిడేషన్ కమిటీ క్రీడాకారులకు బస ఏర్పాట్లను, ఎపిసి-సమగ్రశిక్ష నేతత్వంలో టెక్నికల్ కమిటీ పోటీల నిర్వహణకు సంబంధించిన సాంకేతిక అంశాలను, డిఎంహెచ్ఓ నేతృత్వంలోని మెడికల్ కమిటీ కీడాకారులకు ప్రథమ చికిత్స, అంబులెన్స్ సేవలను నిర్వహించాలని ఆదేశించారు. టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు సంసిద్ధత తెలిపిన స్పాన్సర్ సంస్థల అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, డిఎస్‌డిఓ బి.శ్రీనివాస కుమార్, జెడ్‌పి సిఇఓ వివివిఎస్.లక్ష్మణరావు, ఆర్‌డిఓలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, ఆర్ అండ్ బి ఎస్ఇ జె.కాంతు, డిఎంహెచ్ఓ నరసింహనాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థులకు ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల ఎంఎస్‌సి మైక్రో బయాలజీ విద్యార్థులు అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారనికళాశాలల డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. విద్యార్థులు మైక్రో బయాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డులను అందుకున్నారు. మైక్రో బయాలజీ ప్రథమ, ద్వితీయ సెమిస్టర్స్‌లో అత్యధిక మార్కులు సాధించిన కె.హేమప్రియ, పి.మణి భార్గవి 9.3 గ్రేడ్ పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలోనూ, యూరోషిణి, వై.యామిని 9.02 గ్రేడ్ పాయింట్లతో ద్వితీయ స్థానంలోనూ నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంబిఎస్ఐ స్టేట్ ప్రెసిడెంట్, శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ రీసెర్చ్ డెవలప్మెంట్ డీన్ ప్రొఫెసర్ జి.నరసింహ అకడమిక్ ఎక్సలెన్సు అవార్డులను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఎంఎస్‌సి మైక్రో బయాలజీ కోర్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, చదువుతోపాటు పరిశోధనకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను అభినందించారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఎన్.మూర్తి, మైక్రో బయాలజీ డీన్ వి.అనిల్, మాధవి రత్నప్రియ, అధ్యాపకులు అభినందించారు.

వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఏలేశ్వరం


ఉద్యోగ విరమణ చేసిన తహశీల్దారు ఆర్‌వి.వెంకటేశ్వరరావు అందించిన సేవలు అభినందనీయమని ఎంపిపి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి బుజ్జి ప్రశంసించారు. శుక్రవారం వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి తహశీల్దారు స్థాయికి ఎదిగి ఉద్యోగ విరమణ చేసిన వెంకటేశ్వరరావు అన్ని వర్గాల వారి మన్ననలూ పొందారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి చిక్కాల రాజ్యలక్ష్మి, ఎంపిటిసి కొప్పుల బాబ్జి, ప్రకృతి పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయబాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

8,858 ఎకరాల్లో దాళ్వా వరి సాగు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో 8858 ఎకరాల్లో రైతులు దాళ్వా వరి సాగు చేస్తున్నారని మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులు వెదజల్లే పద్ధతిలో దాళ్వా వరి సాగు చేస్తున్నారన్నారు. మినుము 120 ఎకరాల్లో, పెసర 5 ఎకరాల్లో, మొక్కజొన్న 98 ఎకరాల్లో, వేరుసెనగ 14 ఎకరాల్లో రైతులు దాళ్వాలో సాగు చేస్తున్నారన్నారు. ఈ పంటలన్నీ ఆరోగ్యకరంగా ఉన్నాయన్నారు.

కార్టూ'నిజం'



జాతీయ స్థాయి ఐడియాథాన్ ముగింపు

ప్రజాశక్తి-గండేపల్లి

విద్యార్థులకు సాంకేతిక పరిష్కారాలను రూపొందించేందుకు సృజనాత్మక వేదికగా ఐడియాథాన్-2025 పోటీని ఆదిత్య యూనివర్సిటీ రెండురోజులు నిర్వహిస్తున్న కార్యక్రమం శుక్రవారం ముగిసింది. AIC-THub Foundation, Teckybot సంస్థలతో కలిసి నిర్వహించిన ఈ జాతీయ స్థాయి పోటీలో భారతదేశంలోని 20కి పైగా ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలకు చెందిన 300 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ హ్యాకథాన్‌లో కృత్రిమ మేధస్సు (ఎఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి), రోబోటిక్స్, బిగ్ డేటా, మెకాట్రానిక్స్ వంటి ప్రముఖ పరిశ్రమ 4.0 సాంకేతికతలను ఉపయోగించి రియల్-టైమ్ సమస్యల పరిష్కారాలను అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్యార్థులు స్మార్ట్ అగ్రికల్చర్, హెల్త్‌కేర్, ఎనర్జీ మానేజ్‌మెంట్, స్మార్ట్ ట్రాన్స్‌పోర్టేషన్, క్లీన్ ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించారు. ఈ పోటీలో విజేతలకు ప్రముఖ పరిశ్రమల మెంటోరింగ్, ఫండింగ్ అవకాశాలు, స్టార్టప్ మద్దతు వంటి ప్రత్యేక ప్రోత్సాహకాలు లభించనున్నాయి.కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ సతీష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, వివిధ విభాగాల డీన్‌లు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ సతీష్ రెడ్డి

జిల్లా పరిషత్ భూములను పేదలకివ్వాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

జార్జిపేట పంచాయతీ పరిధిలో జిల్లా పరిషత్‌కు చెందిన భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని సిపిఎం, వైసిపి, ఇతర ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆక్రమణదారుల చెరనుండి జిల్లా పరిషత్ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని శుక్రవారం ఆందోళన చేశారు. సిపిఎం మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు, వైసిపి నాయకులు పెట్ల సూర్యనారాయణరాజు, కెవిపిఎస్ మండల అధ్యక్షుడు విప్పర్తి శ్రీనివాసరావు, ఎంఆర్‌పిఎస్ నాయకుడు పలివెల అర్జునరావు, వార్డు సభ్యుడు శీలి రాజు తదితరులు మాట్లాడారు. సుమారు రూ.10 కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమైనా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా రూ.కోట్ల ప్రభుత్వ భూములు కొందరు దర్జాగా అనుభవిస్తున్నారని తెలిపారు. ఆఖరికి ఆ భూములు చేతులు మారుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. పేదవాడు సెంటు ప్రభుత్వం భూమి ఆక్రమిస్తే అమాంతం అక్కడ వాలిపోయే అధికారగణానికి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ భూములు కనిపించకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. రూ.10 కోట్లు విలువైన ఈ భూమిని ఏళ్లతరబడి 27 మంది స్థానికేతరులు కబ్జా చేసి దర్జాగా అనుభవిస్తున్నారని, రహదారిని ఆనుకుని భారీ నిర్మాణాలు కట్టుకుని వ్యాపారాలు సాగిస్తున్నారని తెలిపారు. కొందరు వాటిని రూ.లక్షలకు విక్రయాలు చేస్తే మరి కొందరు అద్దెలకు ఇచ్చి ఆదాయాలు పొందుతున్నారని తెలిపారు. గతంలో ఈ భూములకు దొంగ పొజిషన్ పట్టాలు ఇవ్వడానికి కొందరు రెవెన్యూ అధికారులు ప్రయత్నం చేయడంతో 2021 సెప్టెంబర్ 4న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఆరు నెలల క్రితం ఇవి జిల్లా పరిషత్ భూములని కోర్టు తీర్పు వెలువడినట్లు కెవిపిఎస్ మండల కన్వీనర్ విప్పర్తి శ్రీనివాస్ తెలిపారు. తక్షణం ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పువ్వల ఆనందరావు, పువ్వల విష్ణుమూర్తి, పలివెల ప్రసాద్, పలివెల మరియదాసు, పువ్వల డేవిడ్ రాజు, సబ్బతి శ్రీను, శిమ్మ రవి పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ భూముల వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

తాగునీటి సమస్యలపై కౌన్సిల్లో చర్చ

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం కౌన్సిల్ హాల్లో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పలు అంశాలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ మాట్లాడుతూ ఒకవైపు ఎన్నికల కోడ్ మరోవైపు కమీషనర్ సెలవుతో అజెండాను పూర్తిగా వాయిదా వేసి జీరో అవర్ నిర్వహించాలని కోరారు. తాగునీటి చెరువులో చేపలు చనిపోయి కొళాయిల్లో గత రెండు రోజులుగా పసరు నీరు వస్తుందని, అధికారులు పట్టించుకోవడంలేదని కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ ఆరోపించారు. పట్టణ ప్రజలకు తాగునీరు అందిస్తున్న ఎన్ఎఫ్‌సిఎల్ చెరువులో చేపలు చనిపోయినా అధికారుల నిర్లక్ష్యంగా అదే నీటిని ప్రజలకు ఎలా సరఫరా చేశారని మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మన్యం చంద్రరావు ప్రశ్నించారు. ఈ విషయమై మున్సిపల్ డిఇ శశిధర్ నిర్లక్ష్య సమాధానంపై చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, కౌన్సిలర్లు సేపేని సురేష్, నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ మేనేజర్ కనకరాజు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చింతపల్లి సుబ్బారావు

ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికలు కీలకం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

20వ శతాబ్దంలో పత్రికా రంగం బాగా విస్తరించి ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో 1780 జనవరి 29న మొదటి వార్తాపత్రిక ప్రచురించడంతో అప్పటి నుంచి ప్రతి సంవత్సరం జనవరి 29న జాతీయ వార్త పత్రికా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. తొలిసారిగా విడుదలైన 'బెంగాల్ గెజిట్' వార్తాపత్రిక భారతీయ పత్రికలకు ప్రేరణగా నిలిచిందన్నారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, దేశభక్తిని ఆనాడు పత్రికలు విస్తతంగా ప్రచారం చేశాయని అన్నారు. అడబాల రత్నప్రసాద్, డాక్టర్ శిరీష, ప్రసాద్ నాయుడు, రాజా, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

చేపల వేటనే జీవనాధారంగా జీవిస్తున్న మత్స్యకారుల ఆర్థికాభివద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని జిల్లా మత్స్య శాఖ అధికారి కె.కరుణాకర్ రావు అన్నారు. ఈ మేరకు ఏలేరు రిజర్వాయర్‌లో ఆయన శుక్రవారం మేలు జాతి చేప పిల్లలను విడుదల చేశారు. సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం నుండి వచ్చే రాయితీలను పొందాలని సూచించారు. అనంతరం మత్స్యకారులకు ఎన్ఎఫ్‌డిపి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కెవి.సూర్యనారాయణ, ఎఫ్‌డిఓర్ నూకరాజు, సిబ్బంది బి.రాజేంద్ర రావు, కె.సురేష్ వి.శ్రీనుబాబు, జయరాజు తదితరులు ఉన్నారు.

ఎన్నికల కోడ్‌తో ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ వెలువడిన నేపథ్యంలో పట్టణంలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించే కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు ఏర్పాటు చేసి ఎన్నికలపై రాజకీయ ప్రభావం కనిపించకుండా చర్యలకు పూనుకున్నారు. ఎన్నికల నియమావళిలో భాగంగా సహాయ ఎన్నికల అధికారి కె.చంద్రశేఖర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సమక్షంలో ఈ పనులను మున్సిపల్ సిబ్బంది చేపట్టారు.



ఫెక్సీలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సలీం మృతిపై నిజాలు వెలికి తీయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

జర్నలిస్ట్ నిఘా ఎడిటర్ సలీమ్‌ది హత్యా, ఆత్మహత్యా అనేదానిపై పూర్తి విచారణ జరిపించి నిజాలు వెలికి తీయాలని సలీం కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు, సలీం కుటుంబం సామర్లకోట సిఐ కృష్ణ భగవాన్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సలీమ్ తో పాటు ఉన్న మరొక మహిళ, వ్యక్తిని అదుపులోకి తీసుకుని పూర్తి విచారణ చేయాలన్నారు. సలీం లావాదేవీలన్నింటిపైనా విచారణ జరిపించాలని కోరారు. సమగ్రంగా విచారణ చేపడతామని సిఐ కృష్ణ భగవాన్ వారికి హామీ ఇచ్చారు.



సిఐతో మాట్లాడుతున్న కుటుంబ సభ్యులు, జర్నలిస్టులు

దివిలిలో ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

దివిలి గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువైద్యాధికారి ఎ.మస్తాన్‌బీ ఆధ్వర్యంలో పశువులకు పరీక్షలు నిర్వహించి పశువుల రోగ నివారణ కోసం రైతులకు మందులు పంపిణీ చేశారు. 12 ఆవులు, 14 గేదెలు, 17 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ శిబిరంలో ఒఎస్ నూకరాజు, పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలో అన్ని గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు ముగిశాయి. రైతులకు దూడల పెంపకముపై, పెయ్య దూడల ఉత్పత్తి అయ్యే వీర్యం కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సంయుక్త సంచాలకులు డాక్టర్ సూర్యప్రకాష్, డిడి అంబేద్కర్, ఎడిఎం శ్రీనివాస్, మండలం డిఆర్ఎస్ ప్రశాంత్ హిమజ, చైతన్య, రవితేజ, నరసింగరావు పాడిరైతులు పాల్గొన్నారు.

డాక్టర్ శైలజ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం ప్రభుత్వా సుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజ సేవలు ప్రశంసనీయమని అభివృద్ధి కమిటీ కో చైర్మన్ జొన్నాడ వీరబాబు, వాగు రాజేష్ కొనియాడారు. ఇటీవల ఉత్తమ సేవా పురస్కారం పొందిన డాక్టర్ శైలజను ఆసుపత్రి సిబ్బందితో కలిసి శుక్రవారం వారు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి అభివద్ధిలోనూ రోగులకు సేవలు అందించడంలోనూ డాక్టర్ శైలజ సేవలను గుర్తించి ప్రభుత్వం ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక చేయడం అభినందనీయమన్నారు.



డాక్టర్ శైలజను సత్కరిస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

కోడిపందేలు ఆడుతున్న నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి-కాజులూరు

గొల్లపాలెం శివారు ధనలక్ష్మి పేటలో కోడిపందేలు నిర్వహిస్తున్న సమాచారంతో దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్టు గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ తెలిపారు. శుక్రవారం గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ దాడిలో ఒక కోడి, రెండు కత్తులు, రూ.1,520 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

ప్రజాశక్తి - ఆలమూరు

వాహన తనిఖీలలో భాగంగా మద్యం తాగి వాహనం నడుపుచున్న ముగ్గురు వ్యక్తులను ఎస్ఐ ఎం.అశోక్ అదుపులోనికి తీసుకొని శుక్రవారం మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మండలంలో వివిధ రహదారి కూడళ్లలో వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా అధిక మద్యం తాగి వాహనం నడుపుతూ కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లికి చెందిన అర్లపల్లి శ్రీరామకష్ణ, మండల కేంద్రానికి చెందిన పాండురాజుల భాస్కర్ గణేష్, మండలంలోని మడికికి చెందిన కుప్పిరెడ్డి శ్రీనులు పట్టుబడ్డారన్నారు. దీంతో ఆలమూరు కోర్టు మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరావు నాయక్ ఒక్కొక్కరికి ఒక నెల రోజుల చొప్పున జైలు శిక్ష విధించారని ఎస్సై అశోక్ తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన వ్యాన్

ప్రజాశక్తి-తాళ్లరేవు

మండలంలోని 216 జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం వ్యాన్ అదుపుతప్పి కాలవలోకి దూసుకుపోయింది. పెట్రోల్ బంకు జంక్షన్‌లో యూ టర్న్ తీసుకుంటున్న ఒక వ్యాన్‌ను తప్పించబోయి కాకినాడ నుంచి యానాం వైపు వస్తున్న శ్రీహరి డైలీ పార్సిల్ వ్యాన్ పక్కనే ఉన్న మురుగు కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో రోడ్డుపక్క చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారి బైకులు ధ్వంసమయ్యాయి. ఆ దుకాణాల వద్ద ఎక్కువ జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గ పరిధిలోని ఒక యువతి అదృశ్యంపై శుక్రవారం యానాం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక కనకాలపేట దంగుడుబియ్యం గంగాధర్ రావు ఇంట్లో అద్దెకు ఉంటున్న అనుబోణి గోవిందరాజులు, పార్వతి కుమార్తె అనుబోని రమ్యశ్రీ (17) ఈ నెల 25వ తేదీ నుండి కనిపించడం లేదని తెలిపారు. రమ్యశ్రీ సుంకరపాలెం ప్రకాష్ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతోందన్నారు. కాలేజీకి పరీక్ష రాయడానికని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, ఆమె కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి అనుబోణి పార్వతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్క్మి మురుగానందం తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం శెట్టిగళ్ళ వేటకు చెందిన బాలిక అదృశ్యమైందని సీతానగరం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. 16 ఏళ్ల బాలిక ఇంట్లో నుంచి బయటకు వెళ్లిందని, అప్పటి నుంచి కనిపించకుండా పోయిందని తల్లిదండ్రులు సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కలవచర్లలో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ వడ్డి వెంకన్నతో కలసి శుక్రవారం ఎంపిడిఒ, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఎ.రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా వివిధ గ్రామాల్లో జరుగుతున్న సిసి రోడ్ల, డ్రైన్ల నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఈ రహదారికి ఎంపిపి నిధులు రూ. 5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఇవి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ వ్యవస్థ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఓబ్బిలిరెడ్డి వేణి, సచివాలయ సిబ్బంది, నిర్మాణ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - మండపేట

విద్యను అభ్యసించడం ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమని మండపేట రూరల్ సిఐ పి.దొరరాజు అన్నారు. అర్తమూరు సత్య భాస్కర జడ్‌పి హైస్కూల్లో విద్యార్థులతో ఏర్పాటుచేసిన మాదకద్రవ్యాల దుర్వినియోగం, రోడ్డు భద్రత నియమాలపై అవగాహనా సదస్సులో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. చదువుకునే వయస్సులో చదువుపై పెట్టే శ్రద్ధ భవిష్యత్తు నిర్ణయిస్తుందనిసీఐ అన్నారు. చెడు స్నేహాలకు వెళ్లకుండా బాగా చదువుకొని అనుకున్న లక్ష్యాలను చేరుకుని ఉన్నత విలువలు గల వ్యక్తులుగా రాణించాలన్నారు. విద్యార్థి దశలో సోషల్ మీడియా జోలికి వెళ్లి కాలాన్ని వృథా చేసుకోవద్దన్నారు. వచ్చే పబ్లిక్ పరీక్షలకు కాలయాపన లేకుండా శ్రద్ధగా చదివి మంచి మార్కులుతో ఉత్తీర్ణులు అవ్వాలని అన్నారు. మత్తుకు సంబంధించినటు వంటి చెడు వ్యసనాలకు బానిస కావద్దని అన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమ ంలో రూరల్ ఎస్ఐ బుచ్చిబాబు, పాఠశాల అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి, పాఠశాల పరిశీలన కమిటి అధ్యక్షులు నల్లమిల్లి వీర్రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం పాల్గొన్నారు.

మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - కె.గంగవరం

మండల కేంద్రం కె.గంగవరంలో శుక్రవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జాతీయ మహిళా కమిషన్ ఆదేశాలతో రామచంద్రపురంలోని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో న్యాయవాది సత్యనారాయణ, మహిళా న్యాయవాది సత్యవేణి మాట్లాడారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు తదితర విషయాలను వివరించారు. ఆర్థిక స్తోమత లేని మహిళలకు న్యాయస్థానాలు అందించేందుకు న్యాయ సేవ సంస్థలు ఆసరాగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో దొమ్మలపాటి సత్యనారాయణ, కెవిప సత్యవేణి, మండల మహిళా సమాఖ్య సభ్యులు ఈ కార్యక్రమంలో హాజరయ్యారు.

పారిశుధ్య లోపంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ కృష్ణ బాపూజీ

పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. శుక్రవారం చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో 2వ వార్డ్ కౌన్సిలర్ ఆకుల కృష్ణ బాపూజీ మాట్లాడుతూ అంతంతమాత్రంగా ఉన్న పారిశుధ్యం సంక్రాంతి నుంచి అధ్వానంగా తయారైందన్నారు. మురుగు కాలువలు దుర్వాసన వెదజల్లుతూ దోమలను ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. రోగాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ చెత్త ట్రాక్టర్ల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పాండవుల మెట్టపై ఉన్న శతాబ్ది పార్కు అభివృద్ధికి మున్సిపాలిటీ నిధులు కేటాయిస్తుంటే కాంట్రాక్టర్ డబ్బులు దండుకుంటున్నాడని, పార్కు అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్కు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కో ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ మాట్లాడుతూ తలుపులమ్మ వీవర్స్ కాలనీ సమీపంలో మున్సిపాలిటీ ఖాళీ స్థలం కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు కేటాయించగా 5 మీటర్ల వెడల్పున ఖాళీ స్థలం మిగిలి ఉందని, ఈ స్థలం భవిష్యత్తులో ఆక్రమణలకు గురి కాకుండా కమ్యూనిటీ హాల్స్‌కు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై టిపిఒ ఫణీంద్ర వివరణ ఇస్తూ ఈ స్థలం వర్షపు నీటి ప్రవాహానికి ఉద్దేశించిందని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని దీన్ని ఎవరికీ కేటాయించకూడదన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్య భాస్కర్ మాట్లాడుతూ పెద్దాపురం పరిధిలో మున్సిపల్ శ్మశానాలకు సేవలందిస్తున్న కాటికాపరులకు ప్రతి నెలా వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్ పప్పల దుర్గారావు మాట్లాడుతూ గోదావరి తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎజెండాలోని అంశాలను వాయిదా వేశారు. తొలుత మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బచ్చు శ్రీదేవి మృతికి కౌన్సిల్ సంతాపం తెలిపింది. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కమిషనర్ కెవి.పద్మావతి, మేనేజర్ జ్యోతి రాణి, డిఇఇ డిఎస్.ప్రకాశరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఫణీంద్ర, ఎఇ కృష్ణ జీవ ప్రసాద్ పాల్గొన్నారు.

కిశోర బాలల రక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం



సదస్సులో ప్రసంగిస్తున్న పీడీ విజయ కుమారి

కిశోర బాలల రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయ్ కుమారి సూచించారు. శుక్రవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవనంలో కిషోరి బాలల రక్షణపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె పసంగించారు. మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి ప్రారంభించిన ఈ సదస్సుకు ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉష అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో విజయ కుమారి మాట్లాడుతూ సదస్సు ద్వారా నేర్చుకున్న అంశాలన్నీ కిషోరి బాలల రక్షణకు, వారికి అండదండలు అందించేందుకు, వారి సమస్యల పరిష్కరించేందుకు ఉపయోగించాలన్నారు. చైల్డ్ ప్రొటెక్ట్ ఆఫీసర్ సిహెచ్.వెంకటరావు మాట్లాడుతూ కిషోరి దశలో బాలురు, బాలికలు ఎదుర్కొనే సమస్యలను వివరించారు. వాటి నుండి బయటపడేందుకు తీసుకునే చర్యలు, సలహాలు, సహకారాలు గురించి అర్థమయ్యే రీతిలో వివరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ కో-ఆర్డినేటర్ డి శ్రీనివాస్, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ రాజేశ్వరి, కాండ్రకోట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చంద్ర కిరణ్ కిషోర్, జిల్లా లీగల్ కో-ఆర్డినేటర్ సుధాకర్, ఎస్ఐ వి.మౌనిక మహిళా చట్టాలు, బాలికల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సిహెచ్.వెంకటలక్ష్మి, కె.చంద్రకళ, టివి.రమణమ్మ, ఉమా, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎఎన్‌ఎంలు, మెప్మా సభ్యులు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

బాలలతో భిక్షాటన చేయించడం నేరం

ప్రజాశక్తి - సామర్లకోట



బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాలలతో భిక్షాటన చేయించడం నేరమని వాటిని మానుకోకుంటే చర్యలు తప్పవని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకట్రావు హెచ్చరించారు. కాకినాడ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి సూచనల మేరకు జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకటరావు ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, విద్యాశాఖ, కార్మిక శాఖ ఆధ్వర్యంలో వీధి బాలలను గుర్తించే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. చిన్నారుల బాల్యం సంతోషంగా సాగిపోవాలని, ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టాన్ని ఉపయోగించుకుని 14 ఏళ్ల లోపు బాలలు అందరూ పాఠశాలల్లోనే ఉండాలని ఆయన చెప్పారు. పట్టణంలో బస్ స్టేషన్, రైల్వే స్టేషన్, ఆటో స్టాండ్, పబ్లిక్ ట్రాఫిక్ ప్రాంతాలు, పరిసర ప్రాంతాల్లో భాక్షటనలో ఉన్న బాలలను, వీధి బాలలను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో ఆరుగురు బాలలను గుర్తించి వారి తల్లులకు కౌన్సిలింగ్ చేశారు. భిక్షాటన చేయించడం నేరమని హెచ్చరించారు. బాలల అక్రమ రవాణా, బాలలను వేధింపులకు గురి చేసినా, బాలలు భిక్షాటన చేస్తూ కనిపించినా వెంటనే బాలల సంరక్షణ కేంద్రాలకు లేదా 1098 చైల్డ్ హెల్ప్ లైన్ ఉచిత సేవ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణాధికారులు కె.శ్రీనివాస్, జె.విజయ, సుధాకర్, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాస్, చినబాబు, దుర్గాభవాని, సహాయ లేబర్ అధికారి రవి, ఎంఇఒ పి.పుల్లయ్య పాల్గొన్నారు.

'చంద్రబాబు పాలనకు ప్రజలు స్వస్తి చెప్పాలి'

ప్రజాశక్తి-ప్రత్తిపాడు



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ముద్రగడ పద్మనాభం

రాష్ట్రంలో చంద్రబాబు పాలనకు ప్రజల స్వస్తి చెప్పాలని మాజీ మంత్రి వైసిపి నాయకులు అన్నారు. మండలంలో ఒమ్మంగి గ్రామంలో ముద్రగడ పద్మనాభం, వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శుక్రవారం పర్యటించారు. గ్రామంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా పని చేసినప్పుడు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తే చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసి జగన్ ప్రవేశపెట్టిన పథకాలను రద్దు చేయడమే అభివద్ధిగా ప్రచారం చేసుకోవడం దారుణం అన్నారు. నియోజకవర్గంలో కొన్ని దశాబ్దల కాలం నుండి ప్రజలు తమ కుటుంబాన్ని ఆదరించారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. తనను ఆదరించినట్టే తన కుమారుడు గిరిబాబును ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గౌతు స్వామి, జెడ్‌పిటిసి బెహరా రాజేశ్వరి, దొరబాబు, ఎంపిపి గోళ్ల క్రాంతి సుధాకర్, వైస్ ఎంపిపి బంకు శ్రీను, రామిశెట్టి నాని, సర్పంచ్ గొనగాల అప్పలరాజు పాల్గొన్నారు.

యాత్రికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

ప్రజాశక్తి-పిఠాపురం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పిఎస్ మధుసూదన్

ప్రముఖ పుణ్యక్షేత్రం కుక్కుటేశ్వర స్వామి దేవస్థానానికి మహాశివరాత్రి సందర్భంగా వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఎస్ మధుసుధన్ అన్నారు. శుక్రవారం ఆయన మహాశివరాత్రి ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 24న శ్రీ రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణం, 26వ తేదీ మహాశివరాత్రి, 27న రథత్సవం, 28న తెప్పోత్సవం శ్రీ పుష్పోత్సవం వైభవంగా నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో దేవస్థాన సహాయ కమిషనర్, ఇఒ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, తహశీల్దారు గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, సిఐ శ్రీనివాస్, ఎస్ఐలు మణికుమార్, జాన్ బాషా, దేవస్థాన సిబ్బంది తదితరులు ఉన్నారు.

తిరుమలరావు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మండల విద్యాశాఖ అధికారి కొయ్యాన తిరుమలరావు సేవలు ప్రశంసనీయమని పలువురు అన్నారు. ఐ.పోలవరం ఎంఇఒ-2 శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఐ.పోలవరం మండలం మురమళ్ళ హైస్కూల్ వద్ద వీడ్కోలు సభ నిర్వహించారు. యుటిఎఫ్, ఎస్‌టియు, ఎపిటిఎఫ్ అధ్యక్షులు అప్పా డి.వెంకటేశ్వరావు, ఆకెళ్ల సూర్యమోహన్, మడికి నాగభూషణం ఆధ్వర్యంలో ఎంఇఒ-1 ఎన్.కొండారెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీమ్ బాషా హాజరై ఎంఇఒ-2 తిరుమలరావు సేవలు కొనియాడారు. తిరుమలరావును పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు, ఉద్యోగులు, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి జి.సూర్యప్రకాశం, రామచంద్రపురం ఉపవిద్యాశాఖధికారి రామలక్ష్మణమూర్తి, సిఎంఒ సుబ్రహ్మణ్యం, ఎఎంఒ రాంబాబు మండల నోడల్ ప్రధానోపాధ్యాయులు కె.వెంకటాచార్య, రేవు అప్పలస్వామి, పి.ఏడుకొండలు, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురమళ్ల హైస్కూల్ వద్ద శుక్రవారం ఎంఇఒ కె.తిరుమలరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో డిఇఒ షేక్ సలీమ్ భాషా పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఉన్న టెన్త్ విద్యార్థుల తరగతిగదిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. టెన్త్ విద్యార్థులను పలు ప్రశ్నలను వేసి సమాధాన్ని తెలుసుకొని పుస్తకాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు.

పోలీసుల సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-జగ్గంపేట

ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్లో సంప్రదించి పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన జగ్గంపేట నెహ్రూ కాలనీలో ఉన్న 18 వీధులలో కాలనీ యువతతో సిఐ, ఎస్ఐ రఘునాథరావు తన సిబ్బందితో కలిసి కాలనీ వాసులకు అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎక్కడైనా కొట్లాటలు, ఏమైనా సమస్యలుంటే వెంటనే తమను సంప్రదించాలని ఆయన కోరారు. జగ్గంపేట సిఐ 9440796529, ఎస్ఐ 9440796569 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సేవా గుణం అవసరం

ప్రజాశక్తి- తాళ్లరేవు

విద్యార్థి దశలోనే సేవాగుణం అలవర్చుకోవాలని నీలపల్లి గ్రామ సర్పంచ్ చిట్టూరి నాగమణి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపును ఆమె ప్రారంభించారు. గ్రామాల్లో పర్యటించి పరిశుభ్రత కార్యక్రమాలతో పాటు ప్రజలతో మమేకమవడం వల్ల అనేక విషయాలు తెలుస్తాయన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను విద్యార్థులు పరిశుభ్రం చేశారు. రెండు రోజులు పాటు గ్రామంలో ఈ క్యాంపు ఉంటుందని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గంగేటి సూరిబాబు, ఉప సర్పంచ్ వస్కా రెడ్డి, గంట గోపి, హెచ్‌ఎం ఎంఆర్.శేషగిరిరావు, కళాశాల ప్రిన్సిపల్ కె.లక్ష్మీనారాయణ, నోడల్ ఆఫీసర్లు కెవి.రమణ, కె.సత్తిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి -సామర్లకోట

విజయవాడలో వరదల సమయంలో ఉత్తమ సేవలు అందించిన పారిశుధ్య సిబ్బందికి రెండు జతల యూనిఫారాలను మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైస్ చైర్మన్ ఊబాజాన్ మోజెస్ అందజేశారు. మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ గతంలో జరిగిన విజయవాడ వరదల సమయంలో సామర్లకోట మున్సిపాలిటీ నుంచి 32 మంది పారిశుధ్య కార్మికులు వెళ్లి ఉత్తమ సేవలను అందించిన కారణంగా వారికి రెండేసి జతల చొప్పున దుస్తులు, యాప్రాన్‌లు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నేతల హరిబాబు, సేపేని సురేష్, కో ఆప్షన్ సభ్యులు సల్లూరి కళ్యాణ్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ మంగతాయారు, సభ్యులు

చర్చ లేకుండా బడ్జెట్ సమావేశం ముగింపు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఎన్నికల కోడ్ వల్ల సమస్యలపై చర్చ లేకుండా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ముగిసింది. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన కమిషనర్ ఎం.కనకారావు ఆధ్వర్యంలో బడ్జెట్ సమావేశం నిర్వహించారు పట్టణంలో దోమల బెడద చాలా ఎక్కువగా ఉందని, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని. తాగునీరు కుళాయిల ద్వారా సరిగా సరఫరా అవడం లేదని, డ్రైనేజీ పూడిక పనులు, వీధి లైట్లు వంటి సమస్యలపై అధికారులు పట్టించుకోవడం లేదని మైనం గంగాభవాని, గుళ్ల సుబ్బయ్య కౌన్సిలర్లు సమావేశంలో లేవనెత్తారు. మేనేజర్ పిఎస్‌ఎస్.నవీన్ బడ్జెట్ చదివి వినిపించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.12,51,630 మిగులు బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గంధం నాగేశ్వరరావు, ఎఇ ప్రభాకర్, కౌన్సిలర్లు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, బెందుకుర్తి సత్తిబాబు, కో ఆప్షన్ సభ్యులు, ఈరుగుల్ల యేసు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ స్టేషన్ల పరిశీలిన

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్లను శుక్రవారం తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక మహారాణి కళాశాలలోని 38, 39, 40, 41 లూథరన్ హైస్కూల్‌లోని 36, 37 పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ కళాశాల సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య ఫోరెన్సిక్ సైన్స్ కాలేజ్ రూపొందించిన ఫోరెన్సిక్ సైన్స్ ఆధారిత ద్వైమాసిక పత్రిక ఫోరెన్సిక్స్ 4వ సంచికను కాకినాడ ఎఎస్‌పి ఎంజెవి.భాస్కర రావు, ట్రైనీ డిఎస్‌పి ఎం.జీవన ప్రారంభించారు. ఫోరెన్సిక్ అవగాహనను పెంపొందించడంలో మ్యాగజైన్ కీలక పాత్రను హైలైట్ చేస్తూ ఎఎస్‌పి ఎంజెవి.భాస్కర రావు ప్రశంసలు తెలిపారు. భవిషత్ తరాలకు సైబర్, ఇతర నేరాలు వాటి శిక్ష చట్టాలు అమలును ఇటువంటి మ్యాగజైన్ ద్వారా తెలుసుకోవడానికి సహాయపడుతుందని తెలిపారు. ఫోరెన్సిక్ టెక్నిక్‌లు, కేస్ స్టడీస్‌లో విలువైన సమాచారం అందించినందుకు పత్రిక జాతీయ గుర్తింపును పొందుతూనే ఉందని, ఈ కొత్త ఎడిషన్ మునుపటి సంచికలకు వచ్చిన అద్భుతమైన స్పందనను అనుసరిస్తోందని కళాశాల ప్రిన్సిపల్ విలాస్ అనిల్ చవాన్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఎల్‌సి బుల్లి రాణి

బడి వయస్సు పిల్లలంతా బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి-పిఠాపురం

బడి వయసు పిల్లలు అంతా బడిలోనే ఉండాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎన్.బుల్లిరాణి అన్నారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక భగత్ సింగ్ నగర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బుల్లి రాణి మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు బాల బాలికలు అందరూ బడిలోనే ఉండాలన్నారు. పిల్లలతో పనులు చేయించరాదన్నారు. చదువుకోవడం ద్వారా పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు పాఠశాల విద్యార్థుల కోసం అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



బుచ్చిరాజు దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

బుచ్చిరాజు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఎవి.నగరం విఆర్ఒ కె.బుచ్చిరాజు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ.. గత 24 సంవత్సరాలుగా రెవెన్యూ విభాగంలో విశిష్ట సేవలు అందించిన బుచ్చిరాజు సహకారం మరువలేనిదన్నారు. తోటి రెవెన్యూ అధికారులకు ఆయన ఆదర్శనీయుడని తెలిపారు. అనంతరం బుచ్చిరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిటి సౌమ్య, ఆర్‌డిటి మస్తానీ, విఆర్‌ఒలు సంఘం అధ్యక్షుడు శేఖర్, బాబ్జి, చంటి పాల్గొన్నారు.

ఉపాధి పనులకు ప్రతిపాదనలు పంపాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రతిపాదనలు లేని గ్రామాల నుంచి పనులకు ప్రతిపాదనలు పంపించాలని డ్వామా పీడీ అడపా వెంకట లక్ష్మి ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పనుల సీజన్ ప్రారంభమైంది కాబట్టి నూతనంగా ఏర్పడిన మేట్ల ద్వారా కూలీలకు పనులు కల్పించాలని, ఇంకా పనులు ఆమోదంలేని గ్రామాల్లో పనులకు టెక్నికల్ అసిస్టెంట్లు వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి జిల్లా కార్యాలయానికి పంపించాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ కృష్ణంరాజు, ఇసి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వికలాంగులకు ట్రై సైకిళ్ల అందజేత

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలోని ఆధార్, రేషన్ కార్డు లేని వికలాంగులకు పిఠాపురం మాజీ ఎంఎల్‌ఎ వర్మ ఆదేశాల మేరకు శుక్రవారం తెలుగుదేశం పట్టణ కార్యాలయంలో ఉచితంగా ట్రై సైకిళ్లు అందజేశారు. వికలాంగుల పరిరక్షణ సమితి ప్రతినిధులు ఉలవలశెట్టి శ్రీను, వివి.సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడిన వికలాంగులకు వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లను త్వరలో అందజేస్తామని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు లేని వికలాంగులను గుర్తించి వారికి సాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు కడారి బాబ్జి, సీరం మాణిక్యం పాల్గొన్నారు.

వీలునామా దస్తావేజు పోయినది

కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, ఇంద్రపాలెం గ్రామం, డోర్ నెం. 3-119/3రు కాపురస్తులు **కడియాల శ్రీనివాసకుమార్ గారి భార్య కడియాల లలితాకుమారి గారు** యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా యొక్క ఆస్తికి సంబంధించి ది. 28-6-1995 సం॥రం తేదీన నా తండ్రి గారు అయిన గుబ్బల సత్యనారాయణ గారు నాకు వ్రాయించి యిచ్చిన వీలునామా దస్తావేజు నెం. 234/1995 (SRO, కాకినాడ) ను నేను ది. 26-1-2025వ తేదీన నా సోదరుడు ఇంద్రపాలెంలో ఉంటున్న ఇంటి నుండి జిరాక్స్ నిమిత్తం ఇంద్రపాలెం బ్రిడ్జి దగ్గరలో గల జిరాక్స్ షాపునకు తీసుకొని వెళ్ళుచుండగా మార్గ మధ్యలో పడిపోయినది. కావున ఈ వీలునామా దస్తావేజు ఎవరికైన దొరికిన ఎడల ఈ క్రింది సెల్ నెంబరుకు గాని, అడ్రసు నందు గాని తెలియజేయగలరు.

కడియాల లలితకుమారి
W/o. శ్రీనివాసకుమార్, ఇంద్రపాలెం
సెల్: 78935 73429